# భళా భవేశ్

**జాతీయస్థాయికి ఎదిగిన యువ షట్లర్**



నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

పిట్ట కొంచెం కూత ఘనమన్నట్లు..పసి ప్రాయం నుంచే అతను బ్యాడ్మింటన్‌లో అదరగొడుతున్నాడు. ఊహ తెలియని వయసు నుంచే కోర్టులో పాదరసంలా కదులుతూ ప్రత్యర్థి పనిపడుతున్నాడు. ఐదేండ్ల వయసులోనే రాకెట్ పట్టిన అతను జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ జాతీయస్థాయికి ఎదిగాడు. పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చేతల్లో నిరూపిస్తున్నాడు హైదరాబాదీ ఆనేకాళ్ల భవేశ్‌రెడ్డి. చిన్నవయసు నుంచే ఆటను అమితంగా ప్రేమిస్తూ పోటీకి దిగిన ప్రతి టోర్నీలో భవేశ్ ప్రతిభ కనబరుస్తూ అనతికాలంలోనే అందరి మన్ననలు పొందాడు. నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ, కోచ్‌ల సలహాలు, సూచనలకు తోడు ఆటలో మెళకువలు పాటిస్తూ దూసుకెళుతున్నాడు. గడిచిన ఏడేండ్ల కాలంలో జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీల్లో అద్భుత విజయాలు సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ దృష్టిలో పడ్డాడు. భవేశ్ ప్రతిభను గుర్తించిన గోపీచంద్..ఆయన అకాడమీలో చోటు కల్పించాడు. సీనియర్ కోచ్‌ల సమక్షంలో శిక్షణ పొందుతున్న 13 ఏండ్ల భవేశ్ అండర్-13 విభాగంలో అప్రతిహత విజయాలతో ప్రస్తుతం జాతీయస్థాయిలో రెండో ర్యాంక్‌కు చేరుకుని ఔరా అనిపించుకున్నాడు. భవిష్యత్‌లోనూ ఇదే ఒరవడి సాధిస్తూ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళుతున్నాడు.

**కుటుంబ నేపథ్యం...**

వీణారెడ్డి, రమణారెడ్డి దంపతులకు లిఖిత్ రెడ్డి, భవేశ్‌రెడ్డి ఇద్దరు కొడుకులు. వీరిది మధ్యతరగతి కుటుంబం. తండ్రి నమస్తే తెలంగాణ పత్రికలో జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తల్లి గృహిణి. తండ్రి రమణారెడ్డికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్‌లో ప్రతిభ ఉన్నప్పటికీ కుటుంబసభ్యుల నుంచి సరైన ప్రోత్సాహం లభించలేదు.దీంతో బ్యాడ్మింటన్‌ను ఎంచుకున్నాడు.

**తండ్రే ప్రేరణగా..**

తన తండ్రినే ప్రేరణగా చేసుకుంటూ భవేశ్..బ్యాడ్మింటన్ వైపు అడుగులు వేశాడు. ఐదేండ్ల వయసులో రాకెట్ పట్టిన భవేశ్..తొలుత తన నిర్ణయాన్ని తల్లితో పంచుకున్నాడు. చదువు, ఆటను రెండింటిని సమన్వయం చేసుకోవడం కష్టమవుతుందని ఆమె సూచించింది. ఆటపై ఉన్న మక్కువను గమనించిన తల్లిదండ్రులు బ్యాడ్మింటన్‌లో కోచింగ్ ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. భవేశ్‌లోని ప్రతిభను గుర్తించిన శ్రీవిద్యా పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రోత్సహించింది.

**గోపీచంద్ శిక్షణలో:**

దాదాపు మూడేండ్లుగా దిగ్గజ షట్లర్ గోపీచంద్ దగ్గర భవేశ్ శిక్షణ పొందుతున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి అండర్-13 టోర్నీల్లో సింగిల్స్, డబుల్స్‌లో సత్తాచాటుతూ లెక్కకు మిక్కిలి ట్రోఫీలు సొంతం చేసుకున్నాడు.

# తిలక్ ధమాకా

**అజేయ సెంచరీతో విజృంభణ • భారత్ 219/6 • పోరాడి ఓడిన దక్షిణాఫ్రికా • సిరీస్‌లో 2-1తో ముందంజ**



**భారత యువ క్రికెటర్ తిలక్‌వర్మ దుమ్మురేపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఫామ్‌లేమితో ఇన్ని రోజులు తడబడ్డ తిలక్..సఫారీల పనిపట్టాడు. సహచరులు విఫలమైన చోట తన విలువ చాటుకుంటూ ధనాధన్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ సెంచూరియన్‌లో తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. తిలక్‌కు తోడు అభిషేక్‌శర్మ రాణింపుతో భారత్ తొలుత 219 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనలో సఫారీలు పోరాడి ఓడారు. దక్షిణాఫ్రికాను జాన్సెన్ ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఫలితంగా నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమ్‌ఇండియా 2-1తో ఆధిక్యంలో నిలిచింది.**

సెంచూరియన్ : భారత్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 పోరు రసవత్తరంగా సాగుతున్నది. బుధవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన 11 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించింది. తొలుత భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. తిలక్ వర్మ(56 బంతుల్లో 107 నాటౌట్, 8ఫోర్లు, 7సిక్స్‌లు) శతకానికి తోడు అభిషేక్ శర్మ (25 బంతుల్లో 50, 3 ఫోర్లు, 5 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో మెరవడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 107 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సిమిలేన్(2/34), మహారాజ్(2/36) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 208/7 పరుగులు చేసింది. జాన్సెన్(17 బంతుల్లో 54, 4ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నా..జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. అర్షదీప్ సింగ్(3/37), చక్రవర్తి(2/54) రాణించారు. తిలక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**తిలక్, అభిషేక్ బాదుడు**

భారత ఇన్నింగ్స్‌లో అభిషేక్, తిలక్ ఆటే హైలైట్. గత మ్యాచ్‌లో మాదిరిగానే సంజూ శాంసన్.. మరోసారి మార్కో జాన్సెన్ తొలి ఓవర్ రెండో బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కానీ బ్యాటింగ్‌లో ప్రమోషన్ పొంది మూడో స్థానంలో వచ్చిన తిలక్.. ఎదుర్కొన్న రెండో బంతికి బౌండరీతో ఖాతా తెరవడమే గాక ఆ మరుసటి బంతిని బ్యాక్‌వర్డ్ పాయింట్ మీదుగా భారీ సిక్సర్‌గా మలిచాడు. గత 8 ఇన్నింగ్స్‌లలో కనీసం 20 పరుగుల మార్కును అందుకోలేకపోయిన అభిషేక్ ఈ మ్యాచ్‌లో మాత్రం నిలబడ్డాడు. కొయెట్జీ 2వ ఓవర్లో 4, 6, 4తో బాదుడుకు శ్రీకారం చుట్టాడు. మొదటి పవర్ ప్లే ముగిసేసరికే భారత్ స్కోరు 70/1గా నమోదైంది. కేశవ్ మహారాజ్ 9వ ఓవర్లో తొలి బంతినే లాంగాన్ మీదుగా సిక్స్ కొట్టిన అభిషేక్.. తర్వాత బంతికే సింగిల్ తీసి అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. కానీ అదే ఓవర్లో నాలుగో బంతిని ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అవడంతో 107 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అతడి స్థానంలో వచ్చిన సారథి సూర్యకుమార్ (1) మరోసారి నిరాశపరిచాడు. హార్దిక్ (18) మూడు ఫోర్లు కొట్టి జోరుమీద కనిపించినా మహారాజ్ 13వ ఓవర్లో ఎల్బీగా వెనుదిరిగాడు.

**వర్మ తొలి శతకం..**

హార్దిక్ ఔట్ అయ్యేటప్పటికే 32 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న తిలక్.. ఆ తర్వాత మరింత జోరుపెంచాడు. పరుగులు రాబట్టడంలో రింకూ సింగ్ (8) వెనుకబడ్డా వర్మ మాత్రం బాదుడు ఆపలేదు. మహారాజ్ 15వ ఓవర్లో 4,6,4 బాదిన అతడు కొయెట్జీ వేసిన మరుసటి ఓవర్లో రెండు భారీ సిక్సర్లు, ఓ బౌండరీ సాయంతో 90కు చేరువగా వచ్చాడు. సిపమ్ల 19వ ఓవర్లో ఐదో బంతిని మిడాఫ్ మీదుగా బౌండరీకి తరలిచండంతో టీ20లలో అతడు తొలి శతకాన్ని సాధించాడు.

**జాన్సెన్ పోరాడినా:**

కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు క్రీజులోకి వచ్చిన సఫారీలు ఆరంభంలోనే తడబడ్డారు. రెండు బౌండరీలు, ఓ సిక్సర్‌తో ఊపుమీదున్న రికెల్టన్ (20)ను అర్షదీప్ బౌల్డ్ చేశాడు. ఇక 13 బంతుల్లోనే 4 ఫోర్లు కొట్టిన మరో ఓపెనర్ హెండ్రిక్స్ (21)ను చక్రవర్తి మొదటి ఓవర్లో స్టంపౌట్ అయ్యాడు. కెప్టెన్ మార్క్రమ్(29), స్టబ్స్(12) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. కుదురుకుంటున్న తరుణంలో స్టబ్స్‌ను ఔట్ చేసి అక్షర్ పటేల్ దెబ్బ తీశాడు. ఆఖర్లో క్లాసెన్(41) బ్యాటు ఝుళిపించాడు. ఇక గెలుపు తమదే అనుకుంటున్న తరుణంలో జాన్సెన్( 54) మెరుపులు మెరిపించాడు.పాండ్యా 19వ ఓవర్‌లో ఏకంగా 26 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలో 16 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న జాన్సెన్‌ను అర్షదీప్ ఔట్ చేయడంతో భారత అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

**ఆటను ఆపిన పురుగులు**

సఫారీ ఇన్నింగ్స్ ఆరంభించిన కొద్దిసేపటికే స్టేడియాన్ని పురుగులు చుట్టుముట్టాయి. ఆటగాళ్లకు ఇబ్బంది కలిగించే అవకాశముండటంతో మ్యాచ్ నిర్వాహకులు కొద్దిసేపు ఆటను తాత్కాలికంగా నిలిపేశారు. సుమారు 20 నిమిషాల విరామం తర్వాత అంపైర్లు ఆటను పునరుద్ధరించారు.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 20 ఓవర్లలో 219/6 (తిలక్ 107 నాటౌట్, అభిషేక్ 50, సిమెలానె 2/34, మహారాజ్ 2/36);
**దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 208/7(జాన్సెన్ 54, క్లాసెన్ 41, అర్షదీప్‌సింగ్ 3/37, చక్రవర్తి 2/54)

## ఆరుగురిపై సస్పెన్షన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు చెందిన ఆరుగురు క్రికెటర్లపై సస్పెన్షన్ వేటు పడింది. వయసు నిబంధనలను అతిక్రమిస్తూ టోర్నీల్లో ఆడినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల నివేదిక ఆధారంగా బీసీసీఐ ఆరుగురు ప్లేయర్లపై వేటు వేస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈనెల 4 నుంచి నవంబర్ 3, 2026 వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. సస్పెన్షన్‌కు గురైన వారిలో సాయిచంద్ర, ప్రేమ్, అనుదీప్, దివేశ్, ఆదిత్య, చిరాగ్ ఉన్నారు.

## సింధు ముందంజ

కుమమొటో: జపాన్ మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. మహిళల సింగిల్స్ విభాగంలో సింధు.. 21-12, 21-8తో బుసానన్ (థాయ్‌లాండ్)పై అలవోక విజయం సాధించింది. ఇక లక్ష్యసేన్.. 22-20, 17-21, 16-21తో లియోంగ్ జున్ హావొ(మలేషియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి గేమ్ నెగ్గినా సేన్ తర్వాత ఆటపై పట్టు కోల్పోయాడు.

## తన్మయ్ శతకం

- హైదరాబాద్ 244/5



హైదరాబాద్, ఆట ప్రతినిధి: రంజీ ట్రోఫీ ఎలైట్ 2024లో భాగంగా గ్రూప్-బీలో ఆంధ్రాతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (124 నాటౌట్) శతకంతో మెరిశాడు. నగరంలోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా బుధవారం మొదలైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. హిమతేజ (36), అభిరాత్ (35) ఫర్వాలేదనిపించారు. తన్మయ్‌తో పాటు రాహుల్ రాధేశ్ (22 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



హైదరాబాద్ వేదికగా రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ టోర్నీ బుధవారం ముగిసింది. బాలుర, బాలికల విభాగాల్లో మొత్తం 10 మంది ప్లేయర్లు జాతీయటోర్నీకి ఎంపికయ్యారు. వీరంతా కోల్‌కతాలో ఈ నెల 19 నుంచి మొదలయ్యే నేషనల్ టోర్నీలో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో ఆస్మా మార్యన్, శ్లోకా తుక్తి, రితిక, రవళిక, తన్మయి ఉన్నారు.

## పాక్ ఆవల ఒక్క మ్యాచ్‌కూ ఒప్పుకోం

**పీసీబీ నిర్ణయానికి ప్రభుత్వం మద్దతు • చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై నీలినీడలు**

కరాచీ: వచ్చే ఏడాది తమ దేశంలో జరగాల్సి ఉన్న ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఎట్టి పరిస్థితుల్లోనూ హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించే ఆస్కారమే లేదన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయానికి ఆ దేశ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆతిథ్య హక్కులు తమ వద్దే ఉన్నందున పాక్ ఆవల ఒక్క మ్యాచ్‌నూ నిర్వహించబోమని పీసీబీ తెలిపింది. ఇదే విషయమై పీసీబీ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. 'చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు ఇక్కడకు రాలేమన్న భారత్ నిర్ణయం గురించి ఐసీసీ మాకు సమాచారం అందించింది. కానీ మా ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. మేం ఒక్క మ్యాచ్‌నూ పాక్ ఆవల నిర్వహించే ప్రసక్తే లేదు. చాంపియన్స్ ట్రోఫీ హక్కులు మా వద్దే ఉన్నాయి' అని తెలిపాడు.



## చార్జర్స్ దూకుడు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(టీపీజీఎల్) సీజన్-4లో ఆటమ్ చార్జర్స్ దూకుడు కొనసాగుతున్నది. బుధవారం నాలుగో రౌండ్ ముగిసే సరికి చార్జర్స్ 699 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, దాసోస్(675), రిట్జ్ మాస్టర్స్(674) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. చార్జర్స్ తరపున భూషణ్, గౌరవ్ 44 పాయింట్లతో రాణించారు.

# సర్వే సరే.. నివేదిక వచ్చేనా?

- ఇప్పటికే బీహార్, ఏపీ, కర్ణాటకలో కులగణన
- అయినా ఒక్క రాష్ట్రంలోనూ వెలువడని నివేదిక
- చట్టాలు అడ్డుగా నిలవడమే కారణం
- రాష్ట్రాలకు పరిమితులు విధించిన రాజ్యాంగం
- జనగణన చేపట్టే అధికారం కేంద్రానిదే



హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల లెక్కలను తీస్తామని, ఆ వివరాల ఆధారంగా అందరికీ సామాజిక న్యాయం చేస్తామని, రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నప్పటికీ ఆ సర్వే నివేదిక వెల్లడవుతుందా? అనే అనుమానాలు సర్వత్రా నెలకొన్నాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3 రాష్ట్రాల్లో కుల సర్వే నిర్వహించినప్పటికీ రాజ్యాంగ, చట్ట పరిమితులతోపాటు ఇతర న్యాయపరమైన అంశాల వల్ల ఆ నివేదికలు ప్రజలకు అందుబాటులోకి రాకపోవడమే ఈ అనుమానాలకు ప్రధాన కారణం. గతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక కూడా ఈ కారణాల వల్లే వెలుగు చూడలేదని, ఇదేవిధంగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సర్వే కూడా అటకెక్కడం ఖాయమని సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

**దేశవ్యాప్తంగా 4 రాష్ట్రాల్లో సర్వే**

- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రస్థాయిలో సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించిన ఘనత తెలంగాణదే. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014 ఆగస్టులో కేవలం ఒక్క రోజులోనే ఎస్‌కేఎస్‌ను నిర్వహించింది. కులాలు, ఉపకులాలతో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి తదితర అంశాలవారీగా 1.3 కోట్ల కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించింది. కానీ, చట్టపరమైన పరిమితులు, కోర్టు వివాదాల వల్ల ఆ నివేదికను వెల్లడించలేని పరిస్థితి ఏర్పడింది.
- ఇదేవిధంగా 2015లో కర్ణాటకలో కుల సర్వే నిర్వహించారు. కానీ, ఆ నివేదిక కూడా ఇప్పటివరకు వెలుగు చూడలేదు.
- బీహార్‌లోని నితీశ్‌కుమార్ ప్రభుత్వం నిరుడు కులగణన నిర్వహించి, ఆ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను 69 శాతానికి పెంచింది. దీనిపై సుప్రీంకోర్టులో వివాదం కొనసాగుతున్నది.
- నిరుడు ఏపీలో కూడా కుల సర్వే నిర్వహించారు. దీనిపై ఆది నుంచే రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత కోర్టు వివాదాల నేపథ్యంలో ఆ నివేదిక కూడా ఇప్పటివరకు వెలుగు చూడలేదు.

**చట్టపరమైన అవాంతరాలు**

వాస్తవానికి దేశంలో జనాభా లెక్కలను సేకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉన్నది. అందుకోసం 1948లో సెన్సస్ యాక్ట్‌ను రూపొందించారు. ఈ చట్టాన్ని అనుసరించే కేంద్ర ప్రభుత్వం ప్రతి పదేండ్లకోసారి జనగణన చేపడుతున్నది. ఈ లెక్కన 2021లో జనగణన చేపట్టాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ విజృంభణ వల్ల చేపట్టలేదు. జనాభా లెక్కల కోసం కేంద్ర ప్రభుత్వం సెన్సస్ యాక్ట్‌కు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ఆ తర్వాత కమిషనర్‌ను, నోడల్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్‌ను నియమిస్తుంది. ఆపై జనగణన చేపట్టి ఆ గణాంకాలను ప్రకటిస్తుంది. ఈ చట్టాన్ని అనుసరించి జనాభా లెక్కలను సేకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు.

**రాష్ట్ర ప్రభుత్వాలకు పరిమితులు**

కేంద్ర ప్రభుత్వం 2008లో గణాంకాల సేకరణ చట్టాన్ని తీసుకొచ్చింది. తద్వారా నిర్దేశిత ప్రాంతానికి, వర్గానికి సంబంధించిన భౌగోళిక, సామాజిక, ఆర్థిక, విజ్ఞాన, పర్యావరణ, పారిశ్రామిక అంశాలపై సర్వే నిర్వహించే వెసులుబాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థలకు సైతం కల్పించింది. దీంతో సామాజిక, ఆర్థిక సర్వేలన్నీ ఈ చట్టానికి అనుగుణంగానే జరుగుతున్నాయి. 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలో ఉన్న జనగణన అంశానికి ఈ చట్టం వర్తించదు. 2008 చట్టానికి అనుగుణంగా కేవలం సర్వేలు మాత్రమే నిర్వహించాలి. అందుకోసం విధిగా నోడల్ ఆఫీసర్‌ను నియమించాలి. సర్వేలో సేకరించిన డాటాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టేందుకు కూడా కేంద్రం అనేక ఆంక్షలు విధించింది. విధివిధానాల రూపకల్పనలో కేంద్రం భాగస్వామ్యం, అనుమతి తప్పనిసరి. సూటిగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే రాష్ట్రాలు సర్వేను నిర్వహించాలి.

**ఇష్టారాజ్యంగా రాష్ట్ర ప్రభుత్వం**

రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సర్వేలు వివాదాస్పదంగా మారడానికి సంబంధిత విధానాలు, చట్టపరిమితులే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు ఇంటింటి సర్వే పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని, కులగణనే కాకుండా సమగ్ర జనగణనను కూడా నిర్వహిస్తున్నదని సామాజికవేత్తలు ఆక్షేపిస్తున్నారు. అంతేకాకుండా 2008 గణాంకాల సేకరణ చట్టానికి అనుగుణంగా నోడల్ ఆఫీసర్‌ను నియమించకుండా, నిపుణుల కమిటీ లేకుండా కేవలం ప్లానింగ్ బోర్డును నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించిందని, పూర్తిగా అధికార యంత్రాంగంతోనే ప్రశ్నావళిని రూపొందించి సర్వే నిర్వహిస్తున్నదని మండిపడుతున్నారు. దీంతో ఈ సర్వే కూడా న్యాయ వివాదాల్లో చిక్కుకోవడం, నిష్ప్రయోజనకరంగా మారడం ఖాయమని నిపుణులు చెరుగుతున్నారు.



కన్నాల గ్రామంలో రైలు పట్టాలపై పడిన వ్యాగన్లు

## గూడ్స్ రైలు బోల్తా.. 12 బోగీలు ధ్వంసం

- జాయింట్ ఊడిపోయి.. ఒకదానిపై మరోటిపడిన వ్యాగన్లు
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు.. 20 రైళ్ల దారి మళ్లింపు

పాలకుర్తి, నవంబర్13: పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వేస్టేషన్ పరిధిలోని కన్నాల గ్రామం (282/37/38 మైలురాయి) వద్ద మంగళవారం రాత్రి ఘోర రైలు ప్రమాదం జరిగింది. కర్ణాటక బళ్లారి నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్తున్న ఐరన్ కాయల్స్ (ఇనుప రోలర్ల లోడ్) వ్యాగన్ రాఘవపూర్ స్టేషన్ సమీపంలో మిడిల్ ట్రాక్‌పై నడుస్తుండగా భారీ ప్రమాదం జరిగింది. 44 బోగీలు ఉన్న గూడ్స్ రైలు వ్యాగన్‌లో ముందు 9 వ్యాగన్ల అనంతరం జాయింట్ ఊడిపోయింది. ఒక్కసారిగా 12 వ్యాగన్లు ఒకదానిపై ఒకటిపడి 12 బోగీలు ధ్వంసం కాగా.. దక్షిణ మధ్య రైల్వేకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. వ్యాగన్లు ఒకదానిపై మరొకటి దొర్లడంతో 300 మీటర్ల మేర మూడు ట్రాక్‌లు ధ్వంసమయ్యాయి. ఎలక్ట్రికల్ లైన్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి.

**భారీగా రైళ్ల దారి మళ్లింపు**

ప్రమాదం జరిగిన వెంటనే దక్షిణమధ్య రైల్వే ఈ మార్గం గుండా నడిచే 20 రైళ్లను రద్దు చేసింది. పలు రైళ్లను దారి మళ్లించింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే వివిధ విభాగాల రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్, కలెక్టర్ కోయశ్రీహర్ష, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులను సమీక్షించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ నుంచి భారీ వాహనాలను తెప్పించి, రెండు ట్రాక్‌లను పూర్తిస్థాయిలో నిర్మించారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్, సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నారు. రాత్రి ఏడున్నర గంటలకు ఒక ట్రాక్‌ను సిద్ధం చేసి, గూడ్స్‌ను నడిపించారు.

# 48 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్

- పోలీసులతో కలిసి టీజీసీఎస్‌బీ స్పెషల్ ఆపరేషన్
- దేశవ్యాప్తంగా రూ.8.16 కోట్లు కాజేసిన కేటుగాళ్లు
- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా వివిధ కేసుల్లో 48 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసినట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించింది. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లోని పోలీసులు, టీజీసీఎస్‌బీ సంయుక్త ఆపరేషన్ ద్వారా వీరిని అదుపులోకి తీసుకున్నామని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ బుధవారం ప్రకటించారు. వీరిపై తెలంగాణ వ్యాప్తంగా 508 కేసులు, దేశవ్యాప్తంగా 2,194 కేసులు నమోదైనట్టు చెప్పారు. మొత్తం రూ.8,16,44,785 కాజేసినట్టు వెల్లడించారు. వ్యాపార పెట్టుబడులు, ఉద్యోగాల పేరిట మోసాలు, డిజిటల్ అరెస్టులు, కొరియర్ స్కామ్‌లకు పాల్పడ్డట్టు పేర్కొన్నారు. వీరిలో 38మందికి మ్యూల్‌అకౌంట్లు ఉన్నట్టు, మిగిలిన 10 మందిని ఏజెంట్లుగా గుర్తించారు. కార్యక్రమంలో ఎస్పీ దేవేందర్‌సింగ్, డీఎస్పీలు సూర్యప్రకాశ్, హరికృష్ణ, ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, ఆశిష్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, మహేందర్, లక్ష్మీనారాయణ, ముఖీద్‌పాషా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పీఎం కుసుమ్‌లో 4వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : పీఎం కుసుమ్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా జీవోను విడుదల చేశారు. కాంపొనెంట్ - ఏ కింద రైతులు ఖాళీ స్థలాల్లో రెండు మెగావాట్ల వరకు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని, గ్రిడ్ కనెక్టివిటీ చేసుకోవచ్చు. స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలు, రైతు సమాఖ్యలు, మండల సమాఖ్యలు పీఎం కుసుమ్ మార్గదర్శకాలను అనుసరించి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం సూచించింది.

## జేఎల్ నియామకపత్రాలెప్పుడిస్తరు..?

- వెరిఫికేషన్ పూర్తయినా 500 మందికి కొలిక్కిరాని నియామకాలు
- 1:1 అర్హుల జాబితాల విడుదలతో జాప్యం
- ఇంకా 7 సబ్జెక్టుల ఫలితాలు విడుదల చేయని వైనం
- ఎదురుచూపుల్లో 2400 మంది అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టుల భర్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎడతెగని తాత్సారం చేస్తున్నది. కొన్ని సబ్జెక్టులకు ఫలితాలు విడుదలైనా, మరికొన్నింటి సబ్జెక్టుల ఫలితాలు విడుదల చేయలేదు. దీంతో 1:1 జాబితాలు విడుదలకాలేదు. కొన్ని సబ్జెక్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తైనా నియామకాలు ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఎంపికైన వారికి నియామక పత్రాలివ్వడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. అయితే కొన్ని సబ్జెక్టుల్లో 1:1 జాబితా విడుదలై, ఎంపికైన 500 మందికి ప్రజా విజయోత్సవాల్లో నియామకపత్రాలివ్వాలంటూ అభ్యర్థులు కోరుతున్నారు. తమకు త్వరగా నియామకపత్రాలివ్వాలంటూ మంత్రులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన అభ్యర్థులు ప్రజావాణికి హాజరై, తమకు న్యాయం చేయాలని వినతిపత్రాలు సమర్పించారు.

**14 ఏండ్ల తర్వాత..**

రాష్ట్రంలో 14 ఏండ్ల తర్వాత జేఎల్ నోటిఫికేషన్ విడుదలైంది. గతంలో 2008లో జేఎల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీచేశారు. మళ్లీ 2022లో నోటిఫికేషన్ జారీ అయ్యింది. గత కేసీఆర్ సర్కారు చొరవతోనే ఈ నోటిఫికేషన్ విడుదలైంది. ఇంటర్ విద్య చరిత్రలో ఒకేసారి 1,392 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022లో నోటిఫికేషన్ జారీచేసింది. టీజీపీఎస్సీ ఇప్పటి వరకు 16 సబ్జెక్టులకు ఫలితాలు విడుదల చేసింది, మరో 7 సబ్జెక్టుల ఫలితాలు విడుదల చేయలేదు. 800 పోస్టుల ఫలితాల కోసం దాదాపు 2400 మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. తమకు త్వరగా 1:1 జాబితా విడుదల చేయడంతోపాటు నియామక పత్రాలు కూడా అందజేయాలని వీరు కోరుతున్నారు.

**2వేలకు పైగా పోస్టులు ఖాళీ..**

ఇంటర్ విద్యలో అధ్యాపకుల లేమి పట్టిపీడిస్తున్నది. జేఎల్ 5,395 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 1,724 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వొకేషనల్ జేఎల్ పోస్టులు 624 ఉండగా, ప్రస్తుతం 334 ఖాళీగా ఉన్నాయి. ఆ పోస్టులు సైతం కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌తో భర్తీ అయినవే. జనరల్, వొకేషనల్ కలిపి మొత్తంగా 2వేలకు పైగా జేఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

- రాష్ట్రవ్యాప్తంగా 1401 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 5.36 లక్షల మంది అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తేతెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గ్రూపు -3 పరీక్షలకు 5.36 లక్షల మంది అభ్యర్థులు హాజరవుతారని, పరీక్షల నిర్వహణకు రాష్ట్రంలో 1401 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి వెల్లడించారు. బుధవారం సచివాలయంలో గ్రూపు-3 పరీక్షల ఏర్పాట్లు, వరి, పత్తి కొనుగోళ్ల పురోగతి, కొత్త నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం, సామాజిక ఆర్థిక సర్వేపై కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు టీజీపీఎస్సీ విస్తృత ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. పరీక్షలు సజావుగా, సక్రమంగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను సీఎస్‌కు వివరించారు.

**ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్లు**

వరి ధాన్యం రాకను ప్రతిరోజూ నిశితంగా పరిశీలించాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్లు జరిగేలా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా వరి దిగుబడి వస్తున్నందున క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.